క్లుప్తంగా

హెల్త్ సూపర్‌వైజర్ రత్నంకు సత్కారం



రత్నంను సత్కరిస్తున్న పాస్టర్లు, సభ్యులు

సీతంపేట: ఉత్తమ సేవలకు గుర్తింపుగా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి సేవా పురస్కారం అందుకున్న హెల్త్ సూపర్‌వైజర్ వై.ఎస్.రత్నంను చర్చిల పాస్టర్లు సత్కరించారు. గురుద్వారా సమీపంలోని ఒక చర్చిలో సోమ వారం జరిగిన కార్యక్రమంలో రాక్ ప్రేయర్ ఫెలోషిప్ అధినేత కె.జాన్, బైబిల్ బిలీవింగ్ చర్చి వ్యవస్థాపకుడు కిషోర్ దరోగా సంఘ సభ్యులతో కలిసి రత్నంను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల్లో మాత్రమే కాకుండా, దేవుడి సేవలో కూడా ఎంతో సహాయకారిగా ఉంటున్న రత్నం భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజారత్నం, రాజ్‌కుమార్ నాగుర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో మల్లికకు రజత పతకం



మల్లికను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఇటీవల పంజాబ్ జలంధర్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విద్యార్థిని ఎస్.జి.జె.ఎస్.మల్లిక 50–52 కిలోల విభాగంలో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మల్లికను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ యు.గంగాభవాని పాల్గొన్నారు.

'స్పందన'కు 13 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 13 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేస్తున్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాగణపతికి లడ్డూల నివేదన



మహాగణపతికి నివేదించిన లడ్డూలు

సీతమ్మధార: సంకట హర చతుర్థి సందర్భంగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం వంశీ పూజలు, విశేష అభిషేకాలు చేశారు. స్వామివారికి లడ్డూలను నివేదించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో సంకట హర చతుర్థి

సీతంపేట: సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం లలితానగర్ లలితా పీఠంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ గణపతికి విశేష అభిషేకం, అలంకరణ చేశారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో విజయ గణపతి హోమం జరిపించారు. బహుళ పంచమి సందర్భంగా మంగళవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక దన్ను





వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల చెక్కును విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు(ఫైల్)

'వైఎస్సార్ ఆసరా'తో డ్వాక్రా మహిళలకు అండగా ప్రభుత్వం

నాలుగో విడత నిధుల విడుదల

రుణమాఫీపై లబ్ధిదారుల హర్షాతిరేకాలు

సీతంపేట: మహిళలు ఆర్థికంగా ఎదిగిన నాడే సమాజం.. తద్వారా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగున్నరేళ్లుగా నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించడానికి, ఉత్పాదకతను మెరుగుపర్చడానికి వైఎస్సార్ ఆసరా పథకాన్ని పొదుపు సంఘాల మహిళలకు అందజేస్తున్నారు. ఈ పథకం కింద 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా సభ్యుల అవుట్ స్టాండింగ్ బ్యాంకు రుణాలను నాలుగు వాయిదాల్లో రీయింబర్స్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గత నాలుగున్నరేళ్లల్లో మూడు విడతల్లో ఆసరా పథకం కింద రుణమాఫీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేసింది. ఈ ఏడాది నాలుగో విడత కింద డ్వాక్రా రుణమాఫీ కోసం వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేశారు.

రూ.28.6 కోట్లు నిధుల మంజూరు

ఉత్తర నియోజకవర్గంలో కొనసాగుతున్న 29,992 మంది డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత కింద రూ.28.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో అత్యల్పంగా 14వ వార్డులో 704 మందికి రూ.31.12 లక్షలు మంజురు కాగా.. అత్యధికంగా 47వ వార్డులో 2,538 మంది సభ్యులకు రూ.3.48 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వరుసగా నాలుగు సార్లు నిధులు విడుదల చేయడంతో పొదుపు సంఘాల మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల వారీగా లబ్ధిదారుల వివరాలు

వార్డు నం.	సభ్యులు	నిధులు
14	704	రూ.31.12 లక్షలు
24	2,293	రూ.2.66 కోట్లు
25	2,005	రూ.1.45 కోట్లు
26	1,152	రూ.2.56 కోట్లు
42	1,175	రూ.73.47 లక్షలు
43	1,874	రూ.1.17 కోట్లు
44	2,145	రూ.2.29 కోట్లు
45	2,148	రూ.1.20 కోట్లు
46	2,740	రూ.1.65 కోట్లు
47	2,538	రూ.3.48 కోట్లు
48	2,000	రూ.2.21 కోట్లు
49	2,328	రూ.1.94 కోట్లు
50	1,204	రూ.82.69 లక్షలు
51	1,823	రూ.1.28 కోట్లు
53	734	రూ.10.99 లక్షలు
54	1,325	రూ.1.01 కోట్లు

నాలుగు విడతలుగా లబ్ధి



44వ వార్డు హీరా కళాంజియ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నాను. ఎన్నికలకు ముందు అక్కచెల్లెమ్మల డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో తీర్చుతానని జగనన్న హామీ ఇచ్చారు. చెప్పినట్టు ఇప్పటికి మూడు సార్లు రూ.10 వేల చొప్పున వైఎస్సార్ ఆసరా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇపుడు నాలుగో విడత కూడా డబ్బులు విడుదల చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– దౌలత్, ముస్లిం తాటిచెట్లపాలెం

మాట నిలబెట్టుకున్న జగనన్న



కృప పొదుపు సంఘంలో పదేళ్లుగా సభ్యురాలిగా ఉంటున్నాను. అప్పట్లో రూ.80 వేలు రుణం తీసుకున్నాను. కొంత తీర్చగా మిగిలి ఉన్న రుణం ఇప్పటికి మూడు సార్లు రూ.6,500 చొప్పున అందుకున్నాను. నాలుగో విడత ఆసరా డబ్బులు కూడా విడుదల అయినట్టు మా ఆర్పీ చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్నకు తోడుగా ఉంటాం.

– ఇమంది లక్ష్మి, రామచంద్రానగర్

ప్రభుత్వం అండగా నిలిచింది



ఆజిఅలీ డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలుగా ఉన్నాను. ఇప్పటికి మూడు సార్లు రూ.1,750 చొప్పున ఆసరా నిధులు జమయ్యాయి. నాలుగో విడత కూడా విడుదలయ్యాయని చెప్పారు. మా ఆయన ఆటో డ్రైవర్. ఇప్పటికి నాలుగు సార్లు వాహనమిత్ర కింద రూ.10 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో నగదు జమైంది. మా బాబుకు అమ్మ ఒడి వస్తోంది. జగనన్న ప్రభుత్వం అన్ని విధాలుగా మమ్మల్ని ఆదుకుంది.

– జి. తులసి, రామచంద్రానగర్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా..



తాజ్‌బాబా గ్రూప్‌లో సభ్యురాలిగా ఉంటున్నాను. గతంలో రూ.50 వేల రుణం తీసుకున్నాను. ప్రభుత్వం చెప్పిన నాటికి మిగిలిన ఉన్న రుణం ఇప్పటికి మూడు సార్లు రూ.8 వేల చొప్పున అంటుకున్నాను. నాలుగో విడత కూడా విడుదల చేశారు. రెండు సార్లు రూ.18,500 చొప్పున వైఎస్సార్ చేయూత అందుకున్నాను. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు అండగా నిలిచిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఆయేషా బేగం, అబిద్‌నగర్

వలంటీర్లకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో వలంటీర్లకు సోమవారం దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో నాలుగు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, సిబ్బంది, పార్టీ కార్యకర్తలు మొత్తంగా 200 మందికి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తన సొంత నిధులతో పండుగ కానుకగా స్వయంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, ఏపీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు హనుమంతు, షేక్ బాబ్జి, రామారావు, సదరం జ్ఞానేష్, పాత్రుడు, రఘునీ, సంపత్, భార్గవ్, కృష్ణ, కిరణ్, జోత్స్న, అనిల్, శ్రీదేవి, అలీ, ఆదిలక్ష్మి, ప్రసన్న, లక్ష్మి, రమణమ్మ, గిరీష్, కనకరాజు, పైడిరాజు, వంశీ, ప్రియ, అన్సర్‌వలీ, నజీర్, రుబీనా పాల్గొన్నారు.

నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో మంగళవా రం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్ల చంద్రమౌళి ఒక ప్రకటనతో పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, ఇతర పెద్దలు హాజరు కావాలని ఆయన కోరారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మంగళవారం ఉదయం 9 గంటలకు మహాత్మా గాంధీ వర్ధంతితోపాటు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తామని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు.

9 నుంచి ఓపెన్ కరాటే పోటీలు



కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

సీతమ్మధార: నిజి శాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధినేత నాయుడు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

కరాటే హబ్‌గా విశాఖ: సుమన్

ఎన్ఎస్ఎస్‌కేఏఐ చైర్మన్, సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ కరాటే ద్వారానే తాను సినీ రంగానికి వచ్చానని చెప్పారు. అయోధ్యలో శ్రీరామదాసు చిత్రంలోని తన సన్నివేశాలను ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖ కరాటే హబ్‌గా ఉండడం హర్షణీయమని, కరాటే మాస్టార్లు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కరాటే అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. క్రీడాకారులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు. సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. అనంతరం చాంపియన్‌షిప్ ట్రోఫీలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోటీ కార్యనిర్వాహక చైర్మన్ దాడి రత్నాకర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, ఎస్‌జీ గ్రూప్ అధినేత కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఏజీఎం సురేష్

విశాఖ విద్య: ఇండియన్ అసోసియేట్స్ ఫిజిక్స్ టీచర్స్ వారు నిర్వహించిన జూనియర్ ఒలింపియాడ్‌లో విశాఖపట్నం శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. వైజాగ్ జోన్ నుంచి 29 మంది ఎంపికైనట్లు సంస్థ ఏజీఎం ఎంవీ.సురేష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య మరోమారు సత్తా చాటుకుందని అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు.

వామపక్షాల నిరసన



నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

సీతమ్మధార: విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ అంతా బూటకమని మండిపడ్డారు. టీడీపీ విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని, అధికార పార్టీ విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి.. పెంచిందన్నారు. ట్రూ అప్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు వై.కొండయ్య, సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఎస్‌కే రెహ్మాన్, కృష్ణారావు, ఎం.మన్మధరావు, బి.ఈశ్వరమ్మ, కె.వనజాక్షి, పడాల గోవింద్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: కంచరపాలెం బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఈ నెల 27న రైల్వే భద్రతా దళం సిబ్బందికి సమాచారం అందింది. వెంట నే ఈ వ్యక్తిని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమ వారం మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉండవచ్చని, సుమారు 5.5 అడుగుల ఎత్తు, చామనచాయ కలిగి ఉన్నాడని, ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీ రావు కోరారు.

బీజేపీ ప్రచారం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు లక్ష్మీనారాయణపురంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత పి.విష్ణుకుమార్‌రాజు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కాలనీలోని ఇంటింటికీ వెళ్లి రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు దూది వీరబాబు, మండల అధ్యక్షుడు పూజారి ఆశీర్వాదం, సీనియర్ నాయకులు కొప్పిశెట్టి శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే వైఎస్ జగన్ సర్కార్ లక్ష్యం

వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు



53వ వార్డులో స్థానికులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

మద్రిపాలెం: అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 53వ వార్డు మద్రిపాలెం 298 సచివాలయం పరిధిలోని లక్ష్మీనగర్, సాయినగర్ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎన్నడూ లేని విధంగా ప్రజాప్రతినిధులు ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు అడిగి తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపించేలా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ప్రజలే కాళ్లరిగేలా ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి సమస్యలు చెప్పినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యేవాడని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజలకు చేరువలో ప్రభుత్వం ఉందని, నేరుగా సమస్యలు చెప్పుకునే స్థాయిలో పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, డైరెక్టర్లు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, రాయుడు శ్రీను, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, వార్డు నాయకులు హనుమంతు, షేక్ బాబ్జి, రామారావు, సదరం జ్ఞానేష్, పాత్రుడు, రఘునీ, సంపత్, భార్గవ్, కృష్ణ, కిరణ్, జోత్స్న, అనిల్, శ్రీదేవి, అలీ, ఆదిలక్ష్మి, ప్రసన్న, లక్ష్మి, రమణమ్మ, గిరీష్, కనకరాజు, పైడిరాజు, వంశీ, ప్రియ, రుబీన, నజీర్, అన్సర్ వలీ, సీనియర్ నాయకులు బోగవల్లి గోవింద్, హరిపట్నాయక్, చిరంజీవి, సునీల్, వెంకటేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు



కప్పరాడలో బోరు నుంచి వస్తున్న నీరు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి 270 సచివాలయం కప్పరాడ కొండవాలు ప్రాంతంలో పనిచేయని బోరుకు సోమవారం జీవీఎంసీ మంచినీటి విభాగం ఏఈ మోహన్ పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి బోరు నెల రోజుల నుంచి పనిచేయకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 29న 'సాక్షి'లో 'పనిచేయని బోరు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపయుక్తంగా పర్యావరణ క్యాలెండర్



పర్యావరణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ తదితరులు

సీతంపేట: పర్యావరణ పరిరక్షణ రోజులను తెలిపేందుకు ప్రత్యేకంగా క్యాలెండర్ ముద్రించడం అభినందనీయమని ఏయూ ఎన్విరాన్మెంటల్ సైన్స్ ప్రొఫెసర్ ఇ.ఉదయ్‌భాస్కర్ రెడ్డి అన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో ముద్రించిన పర్యావరణ పరిరక్షణ రోజుల క్యాలెండర్‌ను సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ రోజులను తెలిపే క్యాలెండర్ ప్రతి ఒక్కరికీ అవసరమని, ఈ క్యాలెండర్‌ను 16 ఏళ్లుగా గ్రీన్ క్లైమేట్ సంస్థ ముద్రించడం గొప్ప విషయమన్నారు. భారత ప్రభుత్వం పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలు, జీవవైవిధ్య ప్రదర్శన దినోత్సవాలు, వన్యప్రాణుల దినోత్సవాలను వివరిస్తూ క్యాలెండర్‌ను రూపొందించారన్నారు. ప్రతి విద్యార్థికి, విద్యా సంస్థకు ఈ క్యాలెండర్ ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సిఫా ట్రస్టు ప్రతినిధి వి.నర్సింగ్, విద్యార్థులు జోష్ణవి, బి.భరద్వాజ్, వెంకటరమణ, గ్రీన్ క్లైమేట్ టీం కార్యదర్శి జె.వి.రత్నం, వలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగపప్పు విక్రయాలు



వినియోగదారులకు సబ్సిడీపై శనగపప్పు విక్రయిస్తున్న సతీష్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం సబ్సిడీపై శనగపప్పు విక్రయించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా భారత్ ధాల్ పేరిట కిలో శనగపప్పును రూ.60కు విక్రయిస్తోంది. రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్ ద్వారా ఆధార్ కార్డుపై రెండు కిలోల చొప్పున శనగపప్పు విక్రయాలు జరుపుతున్నారు. పలువురు వినియోగదారులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు మాట్లాడుతూ సోమవారం 20 బ్యాగుల(25 కిలోలు) శనగపప్పు విక్రయించినట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో గంజాయితో నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. పోలీస్ కమిషనర్ రవిశంకర్, అడిషనల్ కమిషనర్ నాగేంద్రుడు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖజానా జ్యుయలరీ షాపు ఎదురుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథ్ తన సిబ్బందితో కలిసి ప్రదేశానికి చేరుకున్నా రు. అక్కడ ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి వద్ద నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ద్వారకా సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.